

జిల్లాలో 3,73,653 మంది రైతుల ఖాతాల్లో
నేడు రూ.136.46 కోట్లు జమ
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ నిధులు ఈనెల 19వ తేదీ బుధవారం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సంయుక్త వాటా కింద ఏటా రైతుల ఖాతాల్లో రూ.20 వేలు జమవుతాయని, ఇప్పటికే తొలి విడతగా ఒక్కో రైతు ఖాతాలో రూ.7వేలు జమకాగా, ఈ ఏడాది రెండవ విడతగా బుధవారం మరో రూ.7వేలు జమకానుంది. అందులో భాగంగా అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి రెండో విడతగా ఒక్కో రైతుకు రూ.5 వేల చొప్పున జిల్లాలోని 2,05,753 మంది రైతుల ఖాతాల్లో రూ.102.88 కోట్లు జమ అవుతుంది. అలాగే పీఎం కిసాన్ కింద 2వ విడతగా ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున 1,67,900 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.33.58 కోట్లు జమకానుందని, కాగా మొత్తంగా 3,73,653 మంది రైతుల ఖాతాల్లో రూ.136.46 కోట్లు



జమకానుంది. జిల్లాలో చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి చిత్తూరు పట్టణంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో, పూతలపట్టు నియోజకవర్గం యాదమరి ఎంపీడీవో కార్యాలయంలో, పలమనేరు నియోజకవర్గం పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో, పుంగనూరు నియోజకవర్గం పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో, కుప్పం నియోజకవర్గం కుప్పంలోని ఏఎంసి మార్కెట్ యార్డ్, నగరి నియోజకవర్గం పుత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో, గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం గంగాధర్ నెల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో అర్హత కలిగిన రైతులకు అందించనున్నామని తెలిపారు.

యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు

120 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక: ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దేశ భవిష్యత్తుకు అవసరమైన యువత డ్రగ్స్ భారిన పడకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తుషార్ దూడితో కలిసి నార్కోటిక్ కమిటీ సమావేశం, రెవెన్యూ, విద్యాశాఖ, ఆర్టీసీ, సంబంధిత శాఖలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశభవిష్యత్తుకు అవసరమైన యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. మాదకద్రవ్యాల సంబంధిత కార్యకలాపాలను నివారించడానికి ముందస్తు పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాల అవసరాన్ని వివరించారు. ముఖ్యంగా వివిధ కళాశాలలు, ఇతర విద్యాసంస్థలలో, క్యాంపస్లు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందేలా చూసుకోవడానికి, అధిక నిఘా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డగ్స్ నియంత్రణకు పనిచేసే స్వచ్ఛంద సంస్థలను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలన్నారు. మండలస్థాయిలో ఎంఈఓలు, పోలీస్‌శాఖ సమన్వయంతో ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ప్రధానంగా హైస్కూల్ విద్యనభ్యసించి విద్యార్థులకు ఈఅంశంపై అవగాహన పెంచాలన్నారు. విద్యార్థులు ఇంటిలో కంటే ఎక్కువ సమయం హైస్కూల్స్, జూనియర్ కాలేజీలు కళాశాలలోనే ఉంటారని విద్యార్థుల ప్రవర్తన వారి నడవడికపై కళాశాలల యాజమాన్యాలు కూడా నిశితంగా పరిశీలించాలన్నారు. చిత్తూరు జిల్లాకు సరిహద్దుగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఉండడంతో ఇతర రాష్ట్రాల నుండి డ్రగ్స్ జిల్లాకు సరఫరా అయ్యే అవకాశాలు ఉన్నందున ఆర్టీసీ అధికారులు చెన్నై, బెంగళూరు నుండి వచ్చే ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు పోలీస్‌శాఖకు ప్రజలు సహకారం కూడా అవసరమని, రైల్వేస్టేషన్, బస్టాండ్, ప్రధాన కూడళ్లలో రాత్రి సమయంలో గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు రానున్న 120 రోజుల్లో జిల్లా యంత్రాంగంతో పోలీస్‌శాఖ సంయుక్తంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్ రెడ్డి, డీఈఓ వరలక్ష్మి, ఆర్డీవో నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి ఆర్డీఓ, డిఎస్పిలు పాల్గొన్నారు.



నార్కోటిక్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వినికిడి యంత్రాలు పంపిణీ



వికలాంగులకు వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వినికిడి యంత్రాల పరికరాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అందజేశారు. మంగళవారం చిత్తూరు నగరంలోని జ్యోతిరావు పూలే బీసీ భవన్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి దీన్ దయాళ్ శ్రావణ ఫౌండేషన్, నేషనల్ హెల్త్ మిషన్ ఆర్‌బిఎస్‌కే, ఎన్‌పిపిసిడి, ఎన్‌సిడి ద్వారా వికలాంగులకు వినికిడి యంత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 26వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వికలాంగుల కోసం 8 క్యాంపులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్క వికలాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉచితంగా పరికరాలను పొందాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్ వంటి పరికరాలను వారికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పరికరాలన్నీ విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే రోజులలో అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతులు సమాజంలో ఎవరికీ తక్కువ కాదని వీరిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇంకా అర్హత ఉన్న వారందరూ తమకు తెలియజేస్తే వెంటనే వారికి కావలసిన పరికరాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెన్షన్లు తీసుకునే వికలాంగులు, దివ్యాంగులలో 95 శాతం చెవుడు ఉన్నవారికి కృత్రిమ వినికిడి యంత్రాలను ఉచితంగా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాయని తెలిపారు. చెవిటి మిషన్లు ఒక్కొక్కటి సుమారు రూ.20 నుండి 25 వేల వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ డిటి సుధారాణి డిఎం అండ్ హెచ్ఓ, విక్రమ్ కుమార్ రెడ్డి జాయింట్ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, చిత్తూరు చెన్నకేశవులు నాయుడు, రేగుల రామాంజులు చైర్మన్ డిడిఎస్ఎఫ్, సిఆర్.రాజన్ టిడిపి ప్రెసిడెంట్, బిఎం.లక్ష్మీ నారాయణ బిజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, తపాన్ సర్కార్ హెడ్ మార్కెటింగ్ ఎస్‌బియు కెమికల్, ఏ.భువనచందర్ ప్లాంట్ హెడ్ చిత్తూరు, శ్రీరామన్ రీజనల్ హెచ్‌ఆర్ హెడ్ సౌత్, అరుణ్ చీఫ్ మేనేజర్, నవనీత కృష్ణన్ సీనియర్ మేనేజర్ హెచ్‌ఆర్, అబ్బాస్ సత్తార్ డిప్యూటీ మేనేజర్ సిఎస్ఆర్ హెచ్‌ఆర్ పాల్గొన్నారు.

రేపు తిరుపతికి రాష్ట్రపతి రాక

అడుగడుగునా భద్రత

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము తిరుపతి పర్యటన ఖరారయ్యింది. ఈ నెల 20వ తేదీన తిరుపతి జిల్లాకు రానున్నారు. రెండు రోజుల పాటు తిరుమల, తిరుపతిలో పర్యటించనున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో సాయంత్రం 3.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.55 నుంచి 4.30 వరకూ రోడ్డు మార్గంలో తిరుచానూరు చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. సాయంత్రం 5.20 గంటలకు తిరుమల పద్మావతి అతిథిగృహం చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. 21వ తేదీ ఉదయం 9.,30 గంటలకు వరాహస్వామిని దర్శించుకుని, 10 గంటలకు శ్రీవారిని దర్శించుకుంటారు. 10.50 గంటలకు తిరుమల నుంచి బయల్దేరి 11.50 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడనుంచి హైదరాబాద్‌కు బయల్దేరి వెళతారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఆమెకు స్వాగతం పలికేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ 20న మధ్యాహ్నం 1 గంటకు రేణిగుంటకు చేరుకోనున్నారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు పర్యటన నేపథ్యంలో పది రోజులుగా ప్రతిరోజూ సమీక్షిస్తున్నారు. ఢిల్లీ బాంబు ఘటన నేపథ్యంలో తిరుపతిలో హైఅలర్ట్ ప్రకటించారు. తిరుపతి శివారు ప్రాంతంలో ఏడు పోలీసు ఔట్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. తిరుమల తిరుపతిలో బందోబస్తు నిమిత్తం 1500 మంది పోలీసులు పహరా కాస్తున్నారు.



నిరుపయోగంగా నీటి శుద్ధి యంత్రాలు

- పట్టించుకోని ప్రభుత్వం
- పేదలకు అందని శుద్ధ నీరు
- పాఠశాలల్లోనూ ఇదే దుస్థితి
- మూలనపడిన యంత్రాలు

ప్రజాశక్తి- పుంగనూరు

పుంగనూరు నియోజకవర్గంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి పేద ప్రజలకు పరిశుద్ధమైన నీరు అందించాలని లక్ష్యంతో నీటి శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేసి ఉచితంగా తాగునీరు అప్పట్లో అందించారు. అయితే కూటమి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నీటి శుద్ధ యంత్రాలన్నీ మూలన పడ్డాయి. ఒక పుంగనూరు మండలంలో మాత్రం 24 నీటి శుద్ధి యంత్రాలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు పరిశుద్ధమైన నీటిని ఉచితంగా అందించారు. అలాగే పుంగనూరు మున్సిపాలిటీలో కూడా ఆరు చోట్ల నీటి శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క ప్లాంటు ఏర్పాటు చేయడానికి సుమారు ఐదు లక్షల వరకు ఖర్చు చేశారు. వాటర్ ప్లాంట్లను నియోజకవర్గ మొత్తం ఏర్పాటు చేసి గ్రామపంచాయతీలలో నిర్వహణ బాధ్యత సర్పంచులకు అప్పగించారు. పుంగనూరు మున్సిపాలిటీలో వాటర్ ప్లాంట్ నిర్వహణ మున్సిపాలిటీ నిర్వహిస్తుండేది. గత ఒకటిన్నర ఏడాదిగా ప్లాంట్లన్నీ మూతపడ్డాయి. పేద ప్రజలకు ఇది మరికొంత భారంగా పడింది. గ్రామీణ ప్రాంతం, మున్సిపాలిటీ ప్రాంతాల్లో అందరూ పరిశుద్ధ నీటిని వాడుతున్నారు. గత ప్రభుత్వం ఉచితంగా అందజేసేది. ప్రస్తుతం నీటిని కొనుగోలు చేయక తప్పడం లేదు.



పాఠశాలలోను ఇదే దుస్థితి..

రూరల్, అర్బన్ పాఠశాలల్లో కూడా శుద్ధ నీటి యంత్రాలన్నీ మూలన పడేశారు. పుంగనూరు మున్సిపాలిటీలో హైస్కూల్లో ఉన్న వాటర్ ప్లాంట్లు ఒక్కటి కూడా పనిచేయడం లేదు. నాసిరకమైన యంత్రాలు ఇవ్వడం వల్లనే ఇవి మరమ్మతులు గురి అయ్యాయి. అప్పట్లో గుత్తేదారులు నాసిరకం యంత్రాలను అందించి కోట్ల రూపాయలు బిల్లు స్వాహా చేసి చేతులు దులిపేసుకున్నారు. ప్రస్తుతం వీటిపై స్థానిక ఎంఈఓను వివరణ కోరగా అవగాహన లేని సమాధానం ఇస్తున్నారు.

నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్లు అంటే పనిచేయని శుద్ధి కర్మాగారాలు అని అర్థం, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వాటర్ ప్లాంట్లు, పాఠశాలల్లోని ఆర్ఓ ప్లాంట్లు వంటివి మరమ్మతులు లేకపోవడం, నిర్వహణ లోపించడం వల్ల నిరుపయోగంగా మారాయి. ఇవి ప్రజా పన్ను డబ్బుతో నిర్మించబడ్డాయి, కానీ సరైన నిర్వహణ లేకపోవడంతో ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి.

నిర్వహణ లేకపోవడం: ప్లాంట్ల మరమ్మతులు గుత్తేదారు సంస్థలు చేయాల్సి ఉన్నా, వారు వాటిని నిర్లక్ష్యం చేయడం వల్ల అవి పనిచేయడం లేదు.

ప్రభుత్వ నిర్లక్ష్యం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన కొన్ని ప్లాంట్లు నిరుపయోగంగా మారడానికి ప్రభుత్వ నిర్లక్ష్యం ఒక కారణం.

నేటి నుండి నారా భువనేశ్వరి కుప్పం పర్యటన

- 4 రోజులపాటు 4 మండలాల్లో పర్యటన
- యువత, మహిళలతో ప్రత్యేక ముఖాముఖి
- నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి -కుప్పం

సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నేటి నుండి నాలుగు రోజులపాటు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు నుండి కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్న నారా భువనేశ్వరి మరోమారు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో నాలుగు రోజులపాటు పర్యటించనున్నారు. ప్రధానంగా మహిళలు, యువతతో నారా భువనేశ్వరి ప్రత్యేకంగా ముఖాముఖి కానున్నారు. శాంతిపురం మండలంలో ఇటీవల నూతనంగా నేర్పించిన సొంతింటిలో బస చేసి నియోజకవర్గ పర్యటించనున్నారు.

నేటి పర్యటన ఇలా..

నాలుగు రోజుల కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మధ్యాహ్నం రెండు గంటలకు ద్రవిడ వర్సిటీకి చేరుకొని విద్యార్థులతో ముఖాముఖి కానున్నారు. మూడున్నర గంటలకు అక్కడే అలీఫ్ ప్రాజెక్టుకు సంబంధించిన మహిళా పారిశ్రామికవేత్తలతో సమావేశం అవుతారు. సాయంత్రం ఐదున్నర గంటలకు గుడిపల్లి మండలం మల్లప్ప కొండ శ్రీమల్లేశ్వర స్వామిని దర్శించుకుని అక్కడ కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం శాంతిపురం మండలం శివపురంలోని సొంత ఇంటికి చేరుకుని రాత్రి బసవ చేస్తారు.

పర్యటన విజయవంతం చేయండి: ఎమ్మెల్సీ

సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నాలుగు రోజుల కుప్పం నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు నుండే కుప్పం ప్రాంతంలో నారా భువనేశ్వరి పర్యటిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, కరోనా కష్టకాలంలో కుప్పం ఏరియా ఆసుపత్రికి ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఆక్సిజన్ ప్లాంటును ఏర్పాటు చేశారని, మహిళలకు ఉపాధి కోసం శిక్షణ, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, నియోజకవర్గ వ్యాప్తంగా సిమెంట్ బెంచీలు, డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ, కుప్పం, గుడిపల్లి మండలాల్లో గ్రామాల దత్తతతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రధానంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా కుప్పంలో మొబైల్ హెల్త్ వైద్యసేవలను ప్రారంభించి గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్య సేవలు అందిస్తుందన్నారు. నారా భువనేశ్వరి నాలుగు రోజుల కుప్పం నియోజకవర్గం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ సెల్వ రాజ్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, వెంకటేష్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ మణి, యువత అధ్యక్షుడు ప్రశాంత్, క్లస్టర్ ఇంచార్జ్ వేడి, సంతోష్, గిరి, సుబ్బు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని నెట్వర్క్ ఆస్పత్రులలో డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ కింద వచ్చే పేషంట్ల నుంచి డబ్బులు వసూలు చేసినా ఇబ్బంది పెట్టినా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కింద సేవలందించే నెట్వర్క్ ఆసుపత్రులలో ఫిర్యాదులు అందిన ఆసుపత్రులపై జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నెట్వర్క్ ఆసుపత్రుల ద్వారా డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద పేద ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఈ సేవలు పొందేందుకు నెట్వర్క్ ఆస్పత్రులకు వచ్చే పేషెంట్ల నుండి డబ్బులు వసూలు చేసిన వారిని ఇబ్బంది పెట్టిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నెట్వర్క్ ఆసుపత్రుల వారు పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆరోగ్య మిత్రులు వీరికి అవసరమైన సలహాలు వైద్య సేవలు అందించడంలో పూర్తి సహాయ సహకారాలు అందించేలా చర్యలు చేపట్టాలని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ సుదర్శన్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా నెట్వర్క్ ఆసుపత్రులకు సంబంధించి 31 ఫిర్యాదుల అందగా సంబంధిత ఆసుపత్రుల ప్రతినిధులతో ఫిర్యాదులకు సంబంధించిన పేషెంట్ల బిల్లులకు సంబంధించిన డాక్యుమెంట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సమావేశంలో సంబంధిత నెట్వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.



దుమ్ములోనే ప్రయాణం

- తప్పని ప్రమాదాలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- నిర్లక్ష్యంగా అధికారులు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు

మండల కేంద్రం నుండి బలిజకండ్రిగ రోడ్డులో ప్రయాణం నరకప్రయాణంగా ఉంది. కంకర తేలిన రోడ్డులో దుమ్ములో వాహనదారులు ప్రయాణిస్తూ తరచూ ప్రమాదాల భారిన పడుతున్నారు. బలిజ కండ్రిగరోడ్డు, పాలసముద్రం మండల కేంద్రానికి వెళ్లాలంటే ఈ రోడ్డులో వెళ్లాల్సిందే. ఈ రోడ్డు గంగాధర నెల్లూరు మండల కేంద్రం నుంచి ముసలయ్యగారిపల్లి వరకు సుమారు ఐదు కిలోమీటర్ల అక్కడక్కడ కంకర తేలిపోయి ఉంది. ప్రయాణించాలంటే ఇబ్బంది పడాల్సిందే.. దుమ్ములేయాల్సిందే.. అని వాహనదారులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో లారీ, బస్సు, ఇతర పెద్దవాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము కమ్మేస్తుందని వాహనదారులు వాపోతున్నారు. ఆటో, ఇతర వాహనాలు నడిపేవారు ఈ రోడ్లు వెళితే రిపేర్లు తప్పవంటున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు వేయించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



దుమ్ముతో నిండిన రోడ్డు

సమర్థవంతంగా ఘనవ్యర్థాల నిర్వహణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్వచ్ఛ చిత్తూరు కోసం ఘనవ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని సహాయ కమిషనర్ ప్రసాద్ చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ వారిచే నగరపాలక సంస్థలోని వార్డు అమినిటీ, సంక్షేమ, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులకు మంగళవారం స్కిల్ డెవలప్మెంట్‌పై మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణలో నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. తడి, పొడి వ్యర్థాలను సక్రమంగా ప్రాసెస్ చేసి సంపదగా మార్చాలన్నారు. సరైన శిక్షణ పొందడం ద్వారా వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయవచ్చన్నారు. ఎంహెచ్వో డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ. ఎస్‌డబ్ల్యూ బల్క్ వేస్ట్ జనరేటర్స్, వేస్ట్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఎం.ఎస్.డబ్ల్యూ రూల్స్ 2016 తదితర విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొవాలన్నారు. ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నుండి రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ శ్రీనివాస్ వార్డు కార్యదర్శులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈ వెంకట రామిరెడ్డి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్

యువత పరిశ్రమల వైపు మొగ్గు చూపాలి: ఎంపి



ప్రజాశక్తి- పూతలపట్టు: యువత పారిశ్రామిక రంగం వైపు మొగ్గు చూపాలని చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు అన్నారు. మంగళవారం పూతలపట్టు మండల కేంద్రంలో ఆర్ వి పరిశ్రమను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ యువకులు ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్రాలు దేశాలు దాటుతున్నారని, మన రాష్ట్రంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని పారిశ్రామిక రంగం వైపు అడుగులు వేస్తే మరో 10 మందికి ఉపాధి కల్పించవచ్చు అని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను రెండు చేతులు అందిపుచ్చుకొని అభివృద్ధి పదం వైపు సాగాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో పరిశ్రమ అధినేత ముద్దు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల జీవితాల్లో వెలుగులు..

ప్రజాశక్తి -కుప్పం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టిందని, ఇందులో భాగంగా మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్గ్రేడ్ చేసినట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలోని 124 మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్గ్రేడ్ చేయడంతో మంగళవారం అంగన్వాడీ టీచర్లతో ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం సమావేశం అయ్యారు. గతంలో రూ.7వేలు వస్తున్న జీతాన్ని ఉద్యోగోన్నతి కల్పించి రూ.11500లు వచ్చేలా చేశారని అన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు ఉద్యోగోన్నతికి సంబంధించిన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, సుగుణమ్మ, ఏపీఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్, డాక్టర్ వెంకటేష్, సిడిపిఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.




సచివాలయంలో తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే మురళిమోహన్

ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలం కేంద్రం తవణంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది హాజరు, ప్రజలకు అందించే సేవలను పరిశీలించిన ఎమ్మెల్యే పలు లోపాలు గుర్తించి అసహనం వ్యక్తం చేశారు. హాజరు పట్టికలో సంతకాలు చేయకుండా విధులకు గైర్హాజరైన సిబ్బంది విషయం బహిర్గతమైంది. ప్రజల నుంచి వచ్చిన వినతుల వివరాలను ఎమ్మెల్యే ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై గ్రామ ప్రజలు చేసిన ఫిర్యాదులను విని తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లి మండలం టీడీపీ అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, గాలి దిలీప్, క్లస్టర్ ఇన్చార్జ్ ప్రవీణ్ నాయుడు, సింగిల్ విండో ఛైర్మన్ రంజిత్ రెడ్డి, హరిబాబు నాయుడు, పట్నం గోపి పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవోల కార్యవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -విజయపురం (నగరి): ఏపీ ఎన్జీవోల నగరి యూనిట్ కు మంగళవారం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు చిత్తూరు తాలూకా సెక్రటరీ ఎన్వీ ప్రసాద్ ఎన్నికల అధికారిగా, జిల్లా కార్యదర్శి కె. రమేష్ ఎన్నికల పరిశీలకులుగా, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డియప్ప సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియలో అన్ని పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో ఎన్నిక ఏకగ్రీవం అయింది. దీంతో అధ్యక్షులుగా ప్రభాకర్ వర్మ, సహ అధ్యక్షులుగా ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా సురేంద్రకుమార్, విజయకుమార్, తులసి జలంధర్, మహిళా ఉపాధ్యక్షురాలుగా దివ్య, కార్యదర్శిగా వెంకటేశులు, సంయుక్త కార్యదర్శులుగా సతీష్, రఘు, ధనవేలు, మహిళా సంయుక్త కార్యదర్శిగా సునీత, కోశాధికారిగా భానుచందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎన్నికల అనంతరం జిల్లా ఏపీఎన్జీవోస్ అధ్యక్షులు రాఘవులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అందరి వద్ద ప్రమాణం చేయించారు. అసోసియేషన్ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రాష్ట్ర నాయకత్వం ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని సూచించారు. తాలూకా పరిధిలో పరిష్కారం కాని సమస్యలు జిల్లా నాయకత్వ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తా మన్నారు.

పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి -విజయపురం: స్థానిక మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ నిర్వహించారు. సర్పంచులు ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో రాజేంద్ర శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమాలు, పంచాయతీ అభివృద్ధి, నిధుల వినియోగం, పారిశుధ్యం, గ్రామ సభలు వంటి అంశాలపై దృష్టి సారించాలని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సర్పంచ్‌లకు సన్నద్ధం చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.


విద్యార్థులకు సలహాలిస్తున్న ప్రధానోపాధ్యాయులు

విద్యలో పోటీ తత్వం ఉండాలి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: విద్యలో పోటీ తత్వం ఉండాలని ప్రధానోపాధ్యాయులు రాజేంద్రన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 58 గ్రంథాలయ వారోత్సవాల పురస్కరించుకుని గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అంశం క్షుణ్ణంగా పరిశీలించి అవగాహన చేసుకోవాలని తద్వారా వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుశీల, విజ్ఞాతి ఉపాధ్యాయులు జోహారు హసేన్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం కవి సమ్మేళనం నిర్వహించారు. కవి శివకుమార్ మాట్లాడుతూ కవి జ్ఞానాన్ని అక్షర సాహిత్యాన్ని కథలు, కవిత్వాన్ని సమాజానికి అందిస్తూ సమాజ పురోగతికి తోడ్పడతాడని తెలిపారు. మరొక కవి శ్రీనివాస్ మాట్లాడుతూ కవులు తమకంటూ ఒక ప్రపంచాన్ని సృష్టించుకొని ఆ ప్రపంచంతో భవిష్యత్తు గురించి సందేశాన్ని ఇస్తారని జాగ్రత్తలు తెలుపుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల అధికారి హేమకుమార్, పలమనేరు రచయితల సంఘం అధ్యక్షులు మాధవ రెడ్డి, యుగంధర్, పుర ప్రజలు కవులను సత్కరించారు.

చలికాలం జాగ్రత్తగా ఉండాలి

- డాక్టర్ ప్రశాంత్, ఏరియా హాస్పిటల్ డైరెక్టర్



ప్రజాశక్తి-గుడిపల్లి: చలి వాతావరణం వల్ల రోగ నిరోగ శక్తిని బలహీన పరుస్తూ ఇన్ఫ్లూయెంజా వైరస్, ఇతర శ్వాస కోస సమస్యలకు గురవుతారని ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ పేర్కొన్నారు. మంగళవారం అయన మీడియాతో మాట్లాడుతూ చలి కాలంలో ఆస్తమా, జలుబు, క్రానిక్ ఒబెస్ట్రక్టీవ్ లూంగ్ డిసీస్ లాంటి వ్యాధులు తీవ్రమవుతాయని తెలిపారు. తీవ్ర చలి కారణంగా అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయని శరీర ఉష్ణోగ్రత పడిపోవడం, చర్మం లోపలి కణ జాలం గడ్డ కట్టడం వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. చలికాలం కారణంగా రోగ నిరోధక శక్తి బలహీన పడుతుందని, వైరస్‌లు సులభంగా వ్యాపిస్తాయని తెలిపారు. చలి నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు, ఎక్కువ సమస్యలు ఎదుర్కొంటారని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, శిశువులు, ఐదు సంవత్సరాల వయసు వున్న పిల్లలు, తెల్లవారు జామున ఎక్కువ బయట తిరగవద్దని తెలిపారు. శరీరాన్ని వెచ్చగా వుంచుకోవడానికి వెచ్చని దుస్తులు ధరించాలని, వార్మ్ వాటర్ లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి చేతుకి గ్లోవ్స్, శానిటైజర్, ప్రొపెర్ హ్యాండ్ వాషింగ్ లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శ్వాస కోసం లాంటి సమస్యలు వున్నా వారు మాస్క్ లాంటివి ధరించి వాటి నుండి రక్షించు కోవాలని తెలిపారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం



ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): జనవరి 3,4,5 తేదీలలో గుంటూరులో నిర్వ హించనున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు గంగవరం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి తులసినాథం నాయుడుకి ఆహ్వానం అంది నట్లు ఆయన తెలిపారు. ఈ సభలలో పాల్గొని తెలుగు భాషా రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలని మహాసభల నిర్వాహకులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ నుంచి ఆహ్వానం వచ్చిందని తులసినాథం నాయుడు తెలిపారు.



ఆధార్ అప్‌డేట్‌కు తప్పని తిప్పలు!

ప్రజాశక్తి - రొంపిచెర్ల: ఆధార్ కార్డు అప్‌డేట్ చేసు కునేందుకు విద్యార్థు ల తల్లిదండ్రులు నానా కష్టాలు ఎదుర్కొం టున్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఆధార్ అప్డేట్ చేసు కునేందుకు పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసింది. అయితే అక్కడ సచివాలయ సిబ్బంది సక్రమంగా పనిచేయక పోవడంతో నెలల పొడవున విద్యార్థులు, తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. రోజుకు 15 నుంచి 20 మందికి మాత్రమే ఆధార అప్‌డేట్ చేస్తున్నారని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో రోజుకు 40 నుంచి 50 మంది విద్యార్థులకు ఆధార అప్డేట్ చేస్తుంటే రొంపిచెర్ల లో మాత్రం కనీసం 15 మందికి కూడా చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫింగర్ ప్రింట్స్ సక్రమంగా లేకపోవడంతో ఆధార్ అప్డేట్ చేయడం ఆలస్యం అవుతుందని అన్నారు.

నేడు అన్నదాత సుఖీభవ నిధులు జమ

- మండల వ్యవసాయాధికారిణి వనిత

ప్రజాశక్తి -వెదురుకుప్పం: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతు వ్యవసాయ పెట్టుబడి సాయంగా రెండవ విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు వారి వారి ఖాతాలలో జమ అవుతాయని మండల వ్యవసాయ అధికారిణి వనిత తెలిపారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రైతుల ఖాతాల్లోకి నిధులు బుధవారం జమ చేస్తారని పేర్కొన్నారు. వెదురుకుప్పం మండల రైతులు ప్రతి ఒక్కరూ వారి వారి రైతు సేవా కేంద్రా ల వద్ద రెండవ విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల జమను పరిశీలించుకోవాలని సూచించారు. ఈ నిధు ల జమను కడపలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి కార్య క్రమాన్ని అందరూ వీక్షించాలని కోరారు. రైతులు వారి ఖాతా ల్లోకి నగదు జమకాకుంటే వారి పరిధిలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


చెరువుల వేలం నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి సాయితేజ

చెరువుల వేలం ఆదాయం రూ.41,300

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని గంగి నాయనిపల్లి పంచా యతీ పరిధిలో ఉన్న తొరడి చెరువు, అల్లి పూల కుంట, గోవిం దల కుంట, చిన్న కుంట, కొత్తచెరువు, కొత్త కుంట చెరువులను పంచాయతీ కార్యదర్శి సాయి తేజ, సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయం పరిధిలో చెరువుల వేలం పాట నిర్వహించారు. దీనివల్ల పంచాయతీకి 41,300 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి, ఉప మండల పరిషత్ అధికారి నాగార్జున రెడ్డి , పంచాయతీ కార్యదర్శి సాయి తేజ, సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి, వార్డు మెంబర్లు పంచాయతీలో ఉన్న ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వేలం పాట నిర్వహించారు.

నేడు గుడిపల్లిలో నారా భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి-గుడిపల్లి: కుప్పం నియోజకవర్గంలో రెండు రోజులు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నేడు గుడిపల్లి మండలంలో పర్యటిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు సుబ్రమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ద్రావిడ విశ్వవిద్యాలయంలోని విద్యార్థిని విద్యార్థులతో ముఖాముఖి, నేడు మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'మహిళలు స్వయం ఉపాధితో ఎలా ఎదగాలి? అని అంశంపై మాట్లాడతారని, ఆ తర్వాత సాయంత్రం మల్లప్ప కొండలో వెలిసిన మల్లేశ్వరస్వామి ఆలయం లో సాయంత్రం కార్తిక దీపోత్సవంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు భారీగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అర్హులైన పేదలను గుర్తించండి

- ఇళ్ల స్థలాల పంపిణీపై సమీక్ష
- అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మున్సిపల్ పరిధిలో ఇంటి పట్టాల పంపిణీకి అర్హులైన పేద లబ్ధిదారుల జాబితాను వెంటనే సిద్ధం చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అధికకారులను ఆదేశించారు. పట్టణం లోని ఆయన కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో మంగళ వారం పలు అంశాలపై ఎమ్మెల్యే సమీక్షించారు. మున్సిపల్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించి టౌన్ హాల్, డ్రైనేజీ, చెరువు అభివృద్ధి పనులు, తదితరుల అంశాలపై అధికారులను అడిగి తెలుసు కున్నారు. ఇప్పటి దాకా పేదల నుంచి ఇళ్ల స్థలాల కోసం అందిన అర్జీలను పార దర్శకంగా పరిశీలించి అర్హులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఇదివరకే స్థలా లు కలిగి ఇంటి రుణాలు అవసర మైన లబ్ధిదారులను సైతం వార్డుల వారీగా గుర్తించి ప్రభు త్వ ఫలాలు అందేలా చూడాలన్నారు. అతి త్వరలో పేదలకు పట్టాలు పంపిణీ చేసేలా అధికారులు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమీక్షలో తహశీల్దార్ ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎన్వి రమణా రెడ్డి, డీఈ సురేష్, ఏఈ స్నేహప్రియ, టీపీఎస్ ఇందిరా, సర్వేయర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గంగమ్మ ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు


ప్రజాశక్తి- కుప్పం: కుప్పం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం మంగళ వారం అట్టహాసంగా నిర్వహించారు. పాలక మండలి ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్‌గా బిఎంకె రవి చంద్ర బాబు, డైరెక్టర్లుగా సంతోషమ్మ జయరాం నాయుడు, వినాయకన్, మహేష్, శారదమ్మ కందస్వామి, రాజ్‌కుమార్, నరేష్, వెన్నెల శరవణ, మంజులా దేవి మణి, వివస్ లక్ష్మి ఆనంద కృష్ణమూర్తి, జ్యోతిష్, ఆలయ ప్రధాన పూజారి సోమశేఖర్ శాస్త్రిలను ప్రమాణ స్వీకారం చేశారు. అమ్మవారి విగ్రహం ఎదుట నూతన పాలక మండలి సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. గంగమ్మ ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని అమ్మవారికి సేవ చేసే అవకాశం రావడం తమ అదృష్టమని నూతన కమిటీ చైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి బిఎంకె రవిచంద్రబాబు సారథ్యంలోని నూతన కమిటీ విశేషంగా కృషి చేస్తుందని, ఆలయ పునర్నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం నిధులు మంజూ రు చేసిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పేర్కొ న్నారు. ఇప్పటికే ఆలయ అభి వృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారని ప్రైవేట్ భూమి కొనుగోలు, వెండి నాగపడిక తదితర కార్యక్రమాలకు నూతన కమిటీ శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో పికెఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, రాష్ట్ర నేత గోపి నాథ్, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, జనసేన నేత బి నరేష్, విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్, కౌన్సిలర్లు జిమ్ దాము, సోమశేఖర్, సురేష్, రెస్కో డైరెక్టర్లు తులసి, అనసూయ, శివ పాల్గొన్నారు.

నేడు కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -యాదమరి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ యాదమరి మండలంలో బుధవారం కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు మాజీ జెడ్పిటిసి మనోహర్ తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రచ్చబండ ద్వారా కోటి సంతకాల సేకరణను ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని మండలాల పంచాయతీరాజ్ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, పూతలపట్టు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త డాక్టరు సునీల్ కుమార్ , జెడ్పీ వైస్ చైర్మన్ బి ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ వింగ్ ప్రెసిడెంట్ కె మనోహర్ అధ్యక్షతన యాదమరి మండల వైసిపి కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. మండల వైస్ ఎంపీపీలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వైసిపి కుటుంబ సభ్యులు, అభిమానులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, వైస్ సర్పంచులు, మాజీ వైస్ సర్పంచులు, ఎంపీటీసీలు,మాజీ ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, గ్రామ స్థాయి నాయకులు, వైసిపి కుటుంబ సభ్యులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అన్నదమ్ములు ఆదర్శ వైద్యులు..


అన్నదమ్ములను సత్కరిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం కేసి ఆసుపత్రి అధినేత డాక్టర్ మంజునాథ్, డాక్టర్ బాలాజీ లు ఆదర్శ వైద్యులుగా ప్రజల మన్ననలు పొందుతున్నారని కుప్పం మెడికల్ షాప్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కుప్పం అధ్యక్షుడిగా డాక్టర్ మంజునాథ్, టిడిపి వైద్య విభాగం కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడుగా డాక్టర్ బాలాజీ నియమితులు కావడం పట్ల మెడికల్ షాప్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఘనంగా సత్కరించారు. కుప్పంకు చెందిన ఇద్దరు వైద్యులు ఇక్కడే ప్రాక్టీస్ చేస్తూ పేద ప్రజలకు మెరుగైన వైద్యశాల అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని, వైద్య సేవలను ముమ్ముందు మరింత విస్తృతం చేయాలని వారు ఆకాంక్షించారు. కుప్పం ప్రాంత ప్రజలకు సేవ చేయడం తమ అదృష్టమని పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం లక్ష్యంగా కేసీ ఆస్పత్రి పని చేస్తుందని డాక్టర్ మంజునాథ్, డాక్టర్ బాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిరత్నం, మోహన్, గౌతమ్ పాల్గొన్నారు.

కుక్కలు ఉన్నాయి.. పిక్కలు జాగ్రత్త!


శునకాలు సంచరిస్తున్న దృశ్యం


ప్రజాశక్తి -చౌడేపల్లి: మండలంలోని శక్తి క్షేత్రమైన బోయకొండ పరిసర ప్రాంతాలలో కుక్కల సంచారం ఎక్కువ అవుతోంది. తెలుగు రాష్ట్రాలే కాకుండా ఇటు కర్ణాటక , అటు తమిళనాడు భక్తులు ఎక్కువగా వస్తుంటారు. వారు మిగిలిన ఆహార పదార్థాలు విచ్చలవిడిగా పడ వేయటంతో ఈ కుక్కల సంచారం ఎక్కువవుతోంది. ద్విచక్ర వాహనాలకు అడ్డుగా వస్తుండడంతో యాత్రికులు కింద పడి గాయాల పాలవుతున్నారు. ఇటీవల కాలంలో పంచాయతీ సెక్రెటరీ కూడా కుక్కలు అతని ద్విచక్ర వాహనం కింద పడడంతో స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

వైసిపి కార్యకర్తలకు పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న వెంకటేగౌడ

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం మండలం గంద్రాజు పల్లి పంచాయతీ జంగాలపల్లి గ్రామంలో వినాయక చవితి పర్వదినం రోజు చోటుచేసు కున్న ఘర్షణలో కేసులు నమోదై జైలు శిక్షను అనుభవిస్తూ బెయిల్‌పై విడుదలైన వైసిపి కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక పండుగ రోజు వైసిపి నేతలను కొట్టి అన్యాయంగా వారిపైనే కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా కేసులు పెట్టి అరెస్ట్ చేశారన్నారు. టీడీపి రౌడీలు మహిళలపై దాడులు చేసినా వైసిపి సానుభూతి పరులనే నెపంతో వారు ఇచ్చిన ఫిర్యాదుని పోలీసులు తీసుకోకుండా టీడీపీ వారికి అనుకూలంగా వ్యవహరించారన్నారు. ఈ క్రమంలో అక్రమ కేసులో రెండు నెలలపాటు జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై విడుదలైన వైసీపీ నాయకులను పరామర్శించామని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్‌లో తప్పకుండా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలు



ప్రజాశక్తి -శాంతిపురం: గ్రంథాలయాలు జ్ఞాన భాం డా గారాలు అని గ్రంథా లయ ఇన్‌ఛార్జి సుభాషిని అన్నారు. మండల సచి వాలయం కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరైన పలువురు మాట్లాడుతూ ప్రపంచ జ్ఞానాన్ని పొందడానికి దినపత్రికలు చదవడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని తమ జీవితకాలంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ కోణాలలో నిష్ణాతులు కావడానికి దినపత్రికలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన అంశాలపై పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయాలి: ఎంఈఓ

ప్రజాశక్తి -బంగారుపాలెం: పాఠశాలలో పిల్లలకు ఆధార్ కార్డు అప్‌డేట్ చేయాలని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఆధార్ కార్డు సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ పాఠశాలలో పలువురు విద్యార్థిని విద్యార్థులకు ఆధార్ అప్డేట్ కావడంలేదని ఉద్దేశంతో ప్రభుత్వమే పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి అప్డేట్ చేస్తున్నదని విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు దీనిపై శ్రద్ధ ఉంచి అప్‌డేట్ చేసుకోవాలన్నారు.



ఈ క్రాప్ నమోదు రైతులకు ఉపయోగకరం

ప్రజాశక్తి- రామకుప్పం: రైతులు సాగు చేస్తున్న పంటలను రైతు సేవా కేంద్రాల్లో ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని టిడిపి మండల మాజీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ రవిరెడ్డి పేర్కొన్నారు. బందార్లపల్లి-2 సచివాలయంలో మంగళవారం రైతులతో సమావేశం అయ్యారు. ఈ పంట నమోదు వల్ల పంట నష్టపరిహారం, పంటలకు వడ్డీ లేని రుణాలు, పంటల బీమా, పంట ఉత్పత్తుల కొనుగోలుకు వీలుంటుందన్నారు. రైతు సేవ కేంద్ర సిబ్బంది రైతుల ఈ పంట నమోదును వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ రమేష్ రెడ్డి, రంగనాథ్, మురళీమోహన్, గిరి, బాలసుబ్రమణ్యం, మోహన్ బాబు ,మధు,ఆర్ బి కె సిబ్బంది అసిఫ్ పాల్గొన్నారు.

26న ప్రత్యేక ప్రతిభావంతుల వైద్యశిబిరం

ప్రజాశక్తి -శాంతిపురం: శాంతిపురం మండల కేంద్రంలో వున్న మఠం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 26వ తేది బుధవారం ఉదయం 9గంటలకు ప్రత్యేక ప్రతిభావంతులకు, వృద్ధ పౌరుల కోసం సహాయక పరికరాల గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. ఈ గుర్తింపు శిబిరం లో వివిధ రకముల సహాయక పరికరములు (వాకింగ్ స్టిక్స్, వాకర్లు, లెగ్ స్టిక్స్, వీల్ చైర్లు, హియరింగ్ ఎయిడ్స్, క్రచ్చులు, బ్యాటరీ ఆపరేటడ్ ట్రైసైకిల్స్, ట్రైసైకిల్స్, రోలేటర్లు, యంయస్‌కిట్స్, అంధులకు టాకింగ్ వాసులు, వైట్ క్రేన్లు, టచ్ ఫోన్లు, వాయిస్ ఫోన్లు, ఎల్బో క్రచ్చులు, కుష్టు రోగుల కిట్స్, డైసీ ప్లేయర్లు, స్మార్ట్ కేన్,కృతిమ అవయవాలు) ఇచ్చేందుకు గుర్తింపునకు వైద్యశిబిరం నిర్వహిస్తామని ఎంపిడిఓ తెలిపారు.

పలమనేరు: ఈ నెల 24వ తేదీ జెడ్పి హైస్కూలు వికోటలో పలమనేరు నియోజకవర్గ వికలాంగులు, వృద్ధ పౌరుల శారీరక అవసరాలు గుర్తించి వారికి అవసరమైన సహాయక, వసతి పరికరాలను ఎంపిక చేసే శిబిరంలో అర్హులైన ప్రతి ఒక్క వికలాంగులు, వృద్ధ పౌరులు వినియోగించుకోవాలని కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

- నేడు వర్చువల్ విధానంలో సీఎం ముఖాముఖి
- ఏఎంసీ చైర్మన్ జిఎం రాజు

ప్రజాశక్తి -కుప్పం: రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీను అమలు చేస్తోందని కుప్పం ఏఎంసి చైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. కుప్పం ఏఎంసీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జిఎం రాజు మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ యోజన పథకం లో భాగంగా రైతుల ఖాతాల్లో బుధవారం రూ.7 వేలు జమ కానున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటలకు ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారని ఆ కార్యక్రమాన్ని కుప్పం మార్కెట్ యార్డులో రైతుల కోసం ప్రత్యక్ష ప్రసారం చేస్తామన్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో 36473 మంది రైతులకు రూ.23.75 కోట్లు రైతుల ఖాతాలో జమ చేస్తారన్నారు. బుధవారం కుప్పం మార్కెట్ యార్డ్ లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమం లో వైస్ ఛైర్మన్ ప్రియాశరవణ, డైరెక్టర్లు ము నీంద్రనాయక్, తులసి, ఉదయ్, భాను, పవన్ , వడివేలు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో అన్ని సౌకర్యాలూ కల్పించాలి

- డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి


అధికారులకు సూచనలు ఇస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి -కార్వేటినగరం : ఈ నెల 20వ కార్వేటినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే వికలాంగుల వైద్య శిబిరంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి శ్రీదేవి అన్నారు. మంగళవారం ఉదయం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించి అక్కడ అన్ని సౌకర్యాలు లేకపోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ అందరికీ సరిపడా మైదానం ఉండడంతో ఈ స్థలాన్ని ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఈ శిబిరానికి వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహిళ పోలీసులను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో, తహశాల్దారులను ఆదేశించారు. వైద్య శిబిరానికి వచ్చేవారికి అన్ని సౌకర్యాలు నీళ్లు భోజనం వసతి దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. కార్వేటినగరంలో కార్వేటినగరం, పాలసముద్రం, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, గంగాధర్ నెల్లూరు మండలాల నుంచి ప్రత్యే ప్రతిభావంతులు పాల్గొంటారన్నారు. సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు జాగ్రత్తగా వికలాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. పీడీ వెంట ఎంపీడీవో టీ చంద్రమౌళి, తహశీల్దారు నాగరాజు, ప్రిన్సిపాల్ స్వరూప, కార్యదర్శి సెల్వి, సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు సహాయపడాలి

కార్వేటినగరం : ప్రత్యేక ప్రతిభా వంతులు, వృద్ధులను గుర్తించి వారికి అవసరమైన విధంగా సాయ పడేందుకు అందరూ అందుబాటులో వుండాలని ఎంపిడివో టి చంద్రమౌళి పేర్కొన్నారు. కార్వేటినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 20వ తేదీ వికలాంగులు, వృద్ధులకు, పౌరుల శారీరక పరికరాల అవసరాలను గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో టి చంద్రమౌళి పేర్కొన్నారు. ఎంపికైన వారికి వీల్‌ఛైర్లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, తదితర పరికరాలు అంది స్తామని తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యా లయం లో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. సచివాలయ సిబ్బంది వచ్చిన వాళ్లకి అసౌకర్యం లేకుండా పర్యవేక్షిం చాలని ఆదేశించారు. శిబిరానికి వచ్చేటప్పుడు రేషన్ కార్డు, జిరాక్స్ కాపీ రెండు వైపులా, ఆధార్ కార్డు, రెండు జిరాక్సులు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు నాలుగు, మొబైల్ నెంబర్లు రెండు, తీసుకొని రావాలని తెలిపారు.

దళితుల ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆర్‌డీవోకు వినతి



ప్రజాశక్తి- పలమనేరు: బైరెడ్డిపల్లి మండలం వెంగమవారి పల్లె దళితుల ఇళ్లను కూల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలమనేరు రెవెన్యూ డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ వినతి పత్రం సమర్పించింది. వెంగమవారిపల్లెలో మాల, మాదిగలను అదే గ్రామంలో భూ భూస్వామి వెంకట గౌడ్ కూల్చి వేశారని వారు పేర్కొన్నారు. దీనిపై ఆర్డీవో భవాని మాట్లాడుతూ బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తానని వచ్చేవారం మంగళవారం ఖచ్చితంగా గ్రామాన్ని పర్యటిస్తానని పరిశీలన చేసి ఇళ్లను కూల్చిన వారిపై కఠిన చర్యలు తప్పకుండా ఉంటాయని బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆర్డీవో కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాడి గోవిందు, కత్తి శ్రీనివాసులు, జి శంకరప్ప, బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

22న ప్రత్యేక ప్రతిభావంతుల అసెస్‌మెంట్ క్యాంప్

ప్రజాశక్తి -విజయపురం: భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ సూచనల మేరకు, కలెక్టర్ ఆదేశానుసారం ప్రత్యేక ప్రతిభావంతులకు అవసరమైన పరికరాలను అందించడానికి ప్రత్యేక అసెస్‌మెంట్ క్యాంప్‌ను ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేంద్ర, డిటీ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ, నగరి, నగరి మండలం, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన ప్రత్యేక ప్రతిభావంతులకు నగరి పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్యాంప్ నిర్వహిస్తామని తెలిపారు. ఆర్డీవో అనుపమ నేతృత్వంలో నిర్వహించే ఈ క్యాంపునకు డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చిత్తూరు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యం



ప్రజాశక్తి-పెద్దపంజాణి: పర్యావరణాన్ని రక్షించడం వల్ల భవిష్యత్తులో మానవ మనుగడకు అవసరమైన ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించి, భవిష్యత్తు తరాలను కాపాడుకుందామని ఎంపీడీఓ బాలాజీ అన్నారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలో మండలంలోని గ్రామ సర్పంచులు,ఉపసర్పంచులు,పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ బాలాజీ ఆధ్వర్యంలో పర్యావరణ సంరక్షణ-పచ్చదనం పెంపొందించడం పై శిక్షణ నిర్వ హిం చారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి, డిఆర్‌పి మోహన్, మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కుదరని పొత్తు!

- ఇష్టా రాజ్యంగా చేపల చెరువుల వేలం
- ఆదాయం దక్కేది ఎవరికో?
- ఇరిగేషన్, మండల ప్రజా పరిషత్ అధికారుల మధ్య అభిప్రాయ భేదం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలో చేపల చెరువుల వేలం ఇష్టారాజ్యంగా సాగుతోంది.. ఇటు ఇరిగేషన్, అటు మండల ప్రజాపరిషత్‌కు అధికారులకు మధ్య అభిప్రాయ భేదం ఏర్పడడంతో వచ్చే ఆదాయం ఎవరికి చెందాలో అర్థం కాక అయోమయంలో పడ్డారు.

కుదరని సయోధ్య!

మండలంలో గత కొన్ని రోజులుగా చెరువులు వేలం వేస్తున్నారు. ఈ వేలంలో వచ్చే డబ్బును పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలకు వాడుకునే విధంగా ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వంద ఎకరాల కన్నా ఎక్కువ ఉన్నా చెరువులు మాత్రం ఇరిగేషన్ డిపార్టుమెంటుకు 50 శాతం వెళ్లగా, మిగిలిన 50 శాతం పంచాయతీలకి వాడుకునే వెసులుబాటు వుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా నెల్లిపట్ల, ధర్మపుర అయితే మండల ప్రజా పరిషత్, జిల్లా ఇరిగేషన్ డిపార్టుమెంటుల వారికి సయోధ్య కుదరక ఇరిగేషన్ వారి అనుమతులు లేకుండానే మండలంలో చెరువుల వేలం సాగుతోంది. ఇష్టా రాజ్యాంగా ఎవరికి వారు చెరువులను తమ సొంతం చేసుకుని చేపలను పెంచుకోవడానికి సన్నద్ధం అవుతున్నారని సంబంధిత డీఈ ఎస్ నాయక్ తెలిపారు. రాతపూర్వకంగా మండల ప్రజా పరిషత్‌కు వివరణ కోరుతూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నట్లు తెలిసింది.

ఆదాయం దక్కేది ఎవరికో?

ఒకవైపు బైరెడ్డిపల్లి ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి మండలంలోని చెరువులన్నీటిని పంచాయతీలే వాడుకోవచ్చనే విషయం తెలుపుతున్నారు. చెరువులకు ఏ సమస్య వచ్చినా ఇరిగేషన్ వారిదే బాధ్యత అని చెరువులలో వచ్చే ఆదాయంలో తమకు వాటా తప్పకుండా రావాలని వారు తెలుపుతున్నారు.

ఇరిగేషన్‌కు, మండల ప్రజా పరిషత్‌కు మధ్య అభిప్రాయ భేదం

ప్రభుత్వ అధికారులు అస్పష్టతకు గురై ఒకరిపై ఒకరు ఆరోపించుకోవడం కన్నా ఒకే విధి విధానంపై నడవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఒక్కొక్కరు ఒక్కో విధంగా చర్యలు తీసుకోవడం సమంజసం కాదని, ఇప్పటికైనా ఒక పద్ధతి ద్వారా ఏ చెరువులను ఎలా వేలం వేయాలి? ఎంత రుసుం ఎవరికి చెందుతుంది? ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు తీసుకోవాలి? ఏ విధంగా ధనాన్ని దుర్వినియోగం కాకుండా వాడుకోవాలి? అనే విషయాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. కొంతమంది కుర్రాళ్లు ఇష్టానుసారం చెరువుల్లో చేపలను వదిలి పెంపుదల చేస్తున్నారు. దీన్ని చూస్తున్న ప్రజలు, చెరువులకు సంబంధించిన అధికారులు ఏమయ్యారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు



చెరువులో చేప పిల్లలను వదులుకున్న దృశ్యం



హడలెత్తించిన భారీ కొండచిలువ!

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని గాంధీ నగర్ గ్రామ శివారులో మంగళవారం భారీ కొండచిలువ ప్రత్యక్షమై రైతులను బెంబేలెత్తించింది. అటవీ ప్రాంతం నుంచి గ్రామంలోని పంట పొలాల్లో ప్రవేశించి వరి గడ్డి వామిలో చిక్కుకు పోయింది. భారీగా ఉన్న కొండ చిలువ పామును చూసి రైతులు, గ్రామస్థులు హడలెత్తిపోయారు. స్థానికులు గమనించి కొండ చిలువను చాకచక్యంగా పట్టుకొని సమీప అటవీ లోతట్టు ప్రాంతంలో వదిలేశారు.

స్వామిత్వతో స్థిరాస్తి హక్కుల కల్పన

ప్రజాశక్తి - రామచంద్రాపురం :

స్వామిత్వతో గ్రామీణులకు స్థిరాస్తి హక్కు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్య మని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి రైతు విభాగం అధ్యక్షుడు పూజారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళ వారం మండలంలోని సొరకాయల పాల్యం గ్రామ సచివాలయం వద్ద స్వామిత్వపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస స్థలాలలో పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వ హించి, ఆస్తి యాజమాన్యం ధ్రువపత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివా సులు మాట్లాడుతూ స్వామిత్వ ద్వారా పొందే స్థిరాస్తి కార్డుల ద్వారా ఆస్తిపై సర్వ హక్కులు వస్తాయని తెలిపా రు. టిడిపి సీనియర్ నాయకులు కాయం చంద్రబాబు యాదవ్ మాట్లాడుతూ స్వామిత్వ సర్వే నిర్వహణ బాగుం దన్నారు. 250 మంది లబ్ధిదారులను స్థిరాస్తి కార్డులకు ఎంపిక చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ తెలి యజేశారు. గ్రామ సభలో పదిమంది ఉమ్మడి కుటుంబానికి చెందిన లబ్ధిదారులు అభ్యంతరాలు తెలియజే శారని, రెవెన్యూ సర్వే అధికారులతో కలసి విచారణ చేసి పరిష్కరించి, పిపిఎం కార్డ్స్ పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రమ్య, గౌతమ్, పురుషోత్తం, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పిల్లలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కేవీబి పురం: కేవీబి పురం, కళత్తూరు వరద ముంపు బాధిత పిల్లలకు దుస్తులు, పాఠశాలకు బీరువా, అవసరమైన వస్తువులను ఎంఈఓ రవికుమార్ చేతుల మీదుగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, యుటిఎఫ్ జిల్లా పూర్వ సహాయ అధ్యక్షుడు కెఎస్‌బి సూర్య ప్రకాష్, జిల్లా కార్యదర్శి అక్కుపల్లి హేమంత్ కుమార్‌లు మాట్లాడుతూ కళత్తూరులో జరిగిన వరద బీభత్సంతో సర్వస్వం కోల్పోయిన విద్యార్థులకు యుటిఎఫ్ ఉపాధ్యాయులు తమ వంతు సహాయంగా విద్యార్థులకు దుస్తులు, పాఠశాలకు కావాల్సిన వస్తువులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హేచ్ఎం కున్నటి సురేష్, రాగిగుంట హైస్కూల్ హెచ్ఎం వెంకట కృష్ణయ్య, సిఆర్‌పి, సూపర్, ఆనందుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - వాకాడు: గూడూరు డి.డి.ఓ వాణి రెడ్డి మంగళవారం మండల కేంద్రంలోని దళితి వాడను తనిఖీ చేశారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పారిశుధ్య పనులను నిర్లక్ష్యం చేస్తే అంటువ్యాధులు ప్రభలే అవకాశం ఉన్న దృష్ట్యా డి.డి.ఓ ఆ పనులు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీ కార్యదర్శి, తదితర సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ తనిఖీల్లో డిడిఓతో కూడా డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, పంచాయతీ కార్యదర్శి ప్రవళిక, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకోసం యత్నిస్తే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి - చంద్రగిరి:

చంద్రగిరి మండలంలో ఆకతాయి పోకడలతో ఎవరైనా మత్తుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రగిరి సిఐ సురేష్ కుమార్ హెచ్చరించారు. గత కొన్నేళ్లుగా చంద్రగిరి మండలంలో కొంత మంది మత్తుకోసం పెడదోవపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ఎవరైనా గంజాయి కలిగి వుండటం, వినియో గించడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమన్నారు. మత్తుకు బానిసలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు.

అలీషా దర్గాలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :

ఈదులగుంటలోని మగ్దుం బాబా అలీషా దర్గాలో మంగళవారం గంధోత్సవం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ మైనార్టీ విభాగం నాయకులు షాకీర్ అలీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం దర్గా సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. షఫీ, దొరబాబు, ఎన్నారై జహీర్ అహ్మద్, మీర్జావలి తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి-తవణంపల్లి: మండల ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి శిక్షణ ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, స్థానికీకరణ థీమ్ లో భాగంగా స్వచ్ఛమైన, పచ్చని గ్రామంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ శిక్షణలో మండలంలోని పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు. శిక్షణా కార్యక్రమంలో శుభ్రత, వ్యర్థ నిర్వహణ, గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పడం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అమలు విధానంపై విపులంగా వివరించారు. గ్రామ స్థాయిలో శానిటేషన్ పనులను మరింత బలోపేతం చేయడంపై సూచనలు, మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా వనరుల సద్వినియోగం, గ్రామాల్లో పచ్చదనం పెంపుదల, ఓపెన్ డిఫెకేషన్ ఫ్రీ స్థితిని కొనసాగించటం, పంచాయతీల్లో శుభ్రత పర్యవేక్షణ వంటి అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన సిబ్బంది గ్రామాల్లో పరిశుభ్రత చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ విభాగం, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు సహాయ పరికరాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక పరిధిలోని వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన సహాయ పరికరాల కోసం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 19వ తేదీ బుధవారం ఉదయం పీవీకేఎన్ కళాశాల మైదానంలో నిర్వహించే సహాయ పరికరాల గుర్తింపు శిబిరంలో వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులకు అవసరమైన సహాయ పరికరాల గుర్తింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకోసం అర్హులైన వారు తమ గుర్తింపు కార్డులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో శిబిరానికి హాజరుకావాలని కోరారు.

నిందితులకు శిక్షతప్పదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తిరుపతి సిటీ :

పరకామణి చోరీ కేసులో నిందితులకు శిక్ష తప్పదని ఎమ్మెల్యే ఆరిణి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరకామణి చోరీని బయటపెట్టిన మాజీ ఏవీఎస్ఓ సతీష్ కుమార్, సీఐడీ విచారణకు వస్తూ అనుమానాస్పదంగా మృతి చెందటం బాధాకరమన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరక ముందే మాజీ టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సతీష్ కుమార్‌ది ఆత్మహత్య అని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. తన పేరు చెప్పమని సతీష్ కుమార్‌పై అధికారులు ఒత్తిడి తేవడంతోనే, సతీష్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డారని కరుణాకర్ రెడ్డి చెప్పాడు, మరీ సతీష్ కుమార్‌ది ఆత్మహత్య కాదు, హత్యగా ఆధారాలు లభిస్తున్నాయి అని గుర్తు చేశారు. కరుణాకర్ రెడ్డి గుమ్మడి కాయల దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు వ్యవహరించారని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే, మాజీ టిటిడి చైర్మన్ అయిన కరుణాకర్ రెడ్డికి తెలియకుండా తిరుమలలో ఏ విషయం జరగలేదన్నారు. సతీష్ కుమార్ మృతిపై సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నర్ విచారణ చేస్తున్నా రు. సతీష్ కుమార్ హత్యకు కారకులు, పరకామణి చోరీ కేసులో నిందితులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఏడుకొండల వాడు వేసే శిక్ష నుంచి నిందితులు తప్పించుకోలేరని తెలిపారు.